క్లుప్తంగా

కౌన్సిలర్‌కు సన్మానం



కౌన్సిలర్ రామకృష్ణమ్మ, వార్డు ఇన్‌చార్జ్ పెద్దన్నను సత్కరించిన దృశ్యం

ధర్మవరం: ఏళ్ల నాటి రహదారి సమస్యకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సహకారంతో పూర్తి పరిష్కారం చూపించిన వార్డు కౌన్సిలర్ చెలిమి రామకృష్ణమ్మ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ చెలిమి పెద్దన్నను బుధవారం రాత్రి గూడ్స్ షెడ్ కొట్టాల వార్డు ప్రజలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని మొదటి వార్డు గూడ్స్‌షెడ్ కొట్టాలలో కొన్నేళ్లుగా రహదారి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని తారురోడ్డును వేయించారు. ఇటీవల తారురోడ్డును కూడా ప్రారంభించడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా గంగమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట



పూజలు చేస్తున్న దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి

ఓడీ చెరువు: మండల పరిధిలోని మిట్టపల్లి పంచాయతీ వనుకువారిపల్లి గ్రామంలో బుధవారం గంగమ్మ విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తండ్రి దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, పూజలు చేశారు. ఆలయానికి రూ.30 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు షేక్ షాజియా, వైఎస్సార్‌సీపీ నాయకులు మజీద్, శివారెడ్డి, గోవింద రెడ్డి, నారాయణప్ప, నాగరాజు, రామలింగారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్‌బాషా పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సెల్వియా సాలోమన్

ముదిగుబ్బ: గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ సెల్వియా సాలోమన్ వైద్య సిబ్బందికి ఆదేశించారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మూడవ సచివాలయంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టిక, మందులు నిల్వల పంపిణీ పట్టికలు పరిశీలించారు. ఓపీ గదులు, వైద్య పరీక్షల గదులు, కాన్పుల గదులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చే రోగులకు 24 గంటలు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అలాగే మండలంలోని ముక్తాపురంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

'గడప గడపకూ మన ప్రభుత్వం' రేపు

నల్లచెరువు: మండల మేజర్ పంచాయితీ పరిధిలోని రాగన్నగారి పల్లి, గాజేఖాన్ పల్లి, నల్లచెరువు క్వాటర్స్‌లో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 12న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ రమణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ముగిసిన చిన్నమ్మ పరుష



నల్లమాడ: వంకరకుంట సమీపంలోని తుమ్మలామల దుర్గంలో వెలసిన పసిబాల చిన్నమ్మ పరుష బుధవారం కుంకాలు కార్యక్రమంతో ముగిసింది. వంకరకుంట గ్రామ పెద్దలు, ఓడీచెరువు మండలం బత్తినిపల్లి, ముదిగుబ్బ మండలం వీరేపల్లిపేట గ్రామాలకు చెందిన పూజారుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు పరుష జరిగింది. గురువారం వంకరకుంట గ్రామం నుంచి చెరువువాండ్లపల్లి, సీ.కొత్తపల్లి, నల్లమాడ తదితర గ్రామాల మీదుగా పుట్టినిల్లు అయిన బత్తినిపల్లికి చిన్నమ్మ దేవత ఊరేగింపుగా తరలిపోతుందని నిర్వాహకులు తెలిపారు.

14న ఉచిత కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కోట మున్సిపల్ పాఠశాలలో ఈనెల 14వ తేదీ నిర్వహించనున్న ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రోటరీక్లబ్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి జయసింహ, ఆర్గనైజర్ నరేంద్రరెడ్డి, శివయ్య, కొండయ్య తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో బుధవారం వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.

వడ్డీకాసురులు

- అప్పుపై అధిక వడ్డీ వసూళ్లు
- వడ్డీ చెల్లించలేక ఇప్పటికే పలువురి బలవన్మరణం
- వడ్డీ వ్యాపారుల్లో మహిళలు సైతం..
- పోలీసులు దృష్టి సారించాలని కోరుతున్న బాధితులు



- పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో ఓ మహిళ అధిక వడ్డీ వసూలు చేయడంతో పాటు అప్పు సకాలంలో చెల్లించడం లేదని అప్పు తీసుకున్న ఓ మహిళను నెల రోజుల పాటు ఓ ఇంట్లో బంధించిన విషయం గతంలో పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది.
- వడ్డీ వ్యాపారుల సూటి పోటి మాటలు భరించలేక పట్టణంలో కాపురం ఉన్న నల్లచెరువు మండలం అల్లుగుండుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు సాయిప్రసాద్ (40) ఆరు పేజీల సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్న విషయం అందరికీ తెలిసిందే. తన ఆత్మహత్యకు ప్రధాన కారణం వడ్డీ వ్యాపారుల ఒత్తిడే అంటూ కొందరి పేర్లు కూడా ఆ సూసైడ్ నోట్‌లో రాశారు. వారిలో 5 మంది మహిళలు కూడా ఉండటం విశేషం. ఇంకా ఎంతోమంది వడ్డీ వ్యాపారుల సూటి పోటి మాటలకు బలయ్యారు.
- తాజాగా కొద్ది నెలల క్రితం మారుతి నగర్‌కు చెందిన ఓ వడ్డీ వ్యాపారి ఇంట్లో ఐటీ దాడులు జరిగితే రూ.10 కోట్లకు పైగా పట్టుబడిన విషయం తెలిసిందే. అప్పులు ఇవ్వడం, తీసుకోవడం సహజం. అయితే అధిక వడ్డీలు వసూలు చేయడం తప్పు. 'నా ఆస్తికి సంబంధించిన పత్రాలు తాకట్టు పెట్టి నేను పట్టణంలో ఓ వడ్డీ వ్యాపారి దగ్గర నూటికి రూ.10 వడ్డీతో రూ.17 లక్షలు అప్పు తీసుకున్నాను. వడ్డీనే సుమారు రూ.30 లక్షల దాకా చెల్లించాను' అయినా సరే ఆ వడ్డీ వ్యాపారి నన్ను వేధిస్తున్నాడు..అని ఓ బాధితుడు 'సాక్షి'తో ఆవేదన వ్యక్తం చేశాడు.

కదిరి: కదిరిలో అధిక వడ్డీలు పేదవాడి నడ్డి విరిచేస్తున్నాయి. ఇప్పటికే ఎంతోమంది అధిక వడ్డీలు చెల్లించలేక ప్రాణాలు తీసుకున్నారు. నెలకు రూ..100కు రూ.2 వడ్డీ తీసుకోవడం చూశాం. కానీ రోజుకు రూ.10 వడ్డీ తీసుకోవడం కదిరిలోనే చూస్తాం. హోటళ్లలో పని చేసే వారు, చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు తదితరుల నుంచి వారి అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని కొందరు వడ్డీ వ్యాపారులు రోజుకు రూ.100కు రూ.10 చొప్పున వడ్డీ వసూలు చేస్తున్నారు. ఇలా అధిక వడ్డీ వసూలు చేసే వారిలో మహిళలు కూడా ఉన్నారు. ఇవ్వకపోతే అందరి ముందు అవమానిస్తారేమో అనే భయంతో తోటి మనిషికి కూడా తెలియకుండా వడ్డీతో పాటు అసలు డబ్బు చెల్లిస్తున్నారు. ఇలా రోజుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష దాకా కేవలం వడ్డీ డబ్బులే సంపాదించే వారు కదిరి పట్టణంలో 16 మంది ఉన్నారంటే ఎవరికైనా ఆశ్చర్యం వేస్తుంది.

అధిక వడ్డీలు నిజమే



వ్యాపార అవసరాలకు చాలా మంది ఇక్కడ వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పు తీసుకుంటున్నారు. అయితే నూటికి రూ.3, రూ.5 అంటే కూడా ఇవ్వరు. రూ.10 ఇస్తామంటేనే ఇస్తారు. రూ.1000 అప్పు తీసుకుంటే.. చేతికి రూ.900 ఇస్తారు. రోజుకు రూ.100 చొప్పున 10 రోజుల్లో రూ.1000 తిరిగి ఇచ్చేయాలి. ఈ లెక్కనే రూ.10 వేలు తీసుకుంటే రూ.9 వేలు మాత్రమే చేతికిస్తారు. దీన్ని రోజుకు రూ.1000 చొప్పున 10 రోజుల్లో చెల్లించాలి. అవసరాన్ని బట్టి ఒక్కోసారి వడ్డీ ఇంకా పెరగచ్చు. – రవి రాయల్, వ్యాపారి, కదిరి

ఫిర్యాదు చేస్తే చర్యలు



నేను ఈ మధ్యే కదిరి డీఎస్పీగా బాధ్యతలు చేపట్టాను. అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారనే విషయం నాకు ఇప్పుడే తెలిసింది. దీనిపై బాధితులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధిక వడ్డీలు తీసుకునే వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. అధిక వడ్డీ వ్యాపారులపై ఇకపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.
వడ్డీ వ్యాపారం చేయాలన్నా అనుమతులు తప్పనిసరి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అధిక వడ్డీలు తీసుకుంటూ ప్రజలను ఇబ్బంది పెడితేజైలుకు పంపుతాం. – ఎం.శ్రీలత, డీఎస్పీ, కదిరి

వడ్డీ చెల్లించలేక పరారీ

అధిక వడ్డీ చెల్లించలేక.. వడ్డీ వ్యాపారుల ఒత్తిడిలు తట్టుకోలేక హోటల్‌లలో సర్వర్‌లుగా పని చేసేవారు, వంట చేసేవారు ఏ హోటల్‌లోనూ ఎక్కువ రోజులు ఉండలేక పోతున్నారు. చేసేది లేక వడ్డీ వ్యాపారుల కంట పడకుండా పరార్ అవుతున్నారు. అధిక వడ్డీ వ్యాపారుల ఆగడాలపై కొత్తగా వచ్చిన డీఎస్పీ ఎం.శ్రీలత దృష్టి సారించి వడ్డీ వ్యాపారుల బారి నుంచి తమను కాపాడాలని ఎంతోమంది వేడుకుంటున్నారు.

సమస్యలు పరిష్కరిస్తేనే ఆదరణ



మాట్లాడుతున్న ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి

కదిరి అర్బన్: సమస్యలు పరిష్కరించినప్పుడే అధికారులు, ప్రజాప్రతినిధులకు ప్రజల ఆదరణ ఉంటుందని ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గ్రామాల్లో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అక్కడ చాలా వరకు విద్యుత్ శాఖ, హౌసింగ్ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించినపుడే ప్రజలు ఆదరిస్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యుత్ శాఖకు సంబంధించి పలు ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయన్నారు. వీటని సత్వరం పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆ శాఖా అధికారులను ఆదేశించారు. అలాగే రెవెన్యూ అధికారులు హౌసింగ్ లబ్ధిదారులకు సత్వరమే పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో జెడ్పీటీసీ రాధాబాయి, ఈఓఆర్డీ అంజనప్ప, వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్, సర్పంచులు పాల్గొన్నారు.

రోడ్డుపై నీరు నిల్వ ఉంటే చర్యలు

ఓడీ చెరువు: వర్షపు నీరు బయటకు వెళ్లకుండా రోడ్డుపై నీరు నిల్వ ఉంచితే చర్యలు తప్పవని ఎంపీడీఓ పోలప్ప అన్నారు. మండలంలోని సుందరయ్య కాలనీలో రోడ్డుకు ఇరువైపులా మట్టి ఎత్తుగా వేయడంతో వర్షపు నీరు బయటకు పోకుండా రోడ్డుపై నిలిచింది. ఇరువైపులా మట్టి వేయడంతో రోడ్డుపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు బుధవారం సర్పంచ్‌కు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ తొట్లి రంగారెడ్డి ఎంపీడీఓతో కలసి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కాలనీ వాసులతో మాట్లాడారు. రోడ్డుపై నీరు వెళ్లేందుకు అడ్డు తొలగించాలని సూచించారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తనకల్లు: మండల పరిధిలోని రాకుంటపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మ తల్లి ఆలయానికి ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి బుధవారం రూ.25 వేలు, పీర్ల చావిడి నిర్మాణానికి రూ.10 వేలు విరాళంగా అందజేశారు. గుడి, పీర్లచావడి నిర్మాణాలకు సాయం చేసిన ఎమ్మెల్యేకు ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, సర్పంచులు నాగేంద్ర, సురేష్, ఎంపీటీసీ ఈశ్వరప్ప, నాయకులు శ్రీనివాసులనాయుడు, రామమోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, గౌస్‌పీర్, నజీర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

బెస్త విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ధర్మవరం అర్బన్: పదో తరగతిలో 500 మార్కులకు పైగా సాధించిన పట్టణంలోని బెస్త విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని బెస్త సేవా సంఘం అధ్యక్షుడు దత్త శివ, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ధర్మవరం పరిధిలో ఉండే విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 9248911111 నంబర్‌కు సంప్రదించాలన్నారు. గంగమ్మ ఆలయం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చెరువు కట్టకింద ఉన్న సొంత స్థలాన్ని తన తల్లిదండ్రుల పేరుతో గడ్డం బెస్త శ్రీనివాసులు అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బెస్త సేవా సంఘం సభ్యులు వెంకటరమణ, ఆదినారాయణ, వెంకటేష్, రాధాకృష్ణ, విజయభాస్కర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యత

ప్రశాంతి నిలయం: మున్సిపాలిటీలో ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందని చైర్మన్ తుంగ ఓబులపతి అన్నారు. బుధవారం సాయంత్రం కర్ణాటక నాగేపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను అధికారులతో కలసి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో సుమారు రూ.3 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సైతం మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే కోటాలో ప్రత్యేకంగా రూ.1.5 కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యాక్రమంలో భాగంగా ప్రజల నుంచి అందిన అర్జీలను సైతం పరిశీలించి వారి అభ్యర్థన మేరకు కూడా అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో నెడ్‌క్యాబ్ డైరెక్టర్ మాధవరెడ్డి, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఏఈ స్వాతి పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు



టీ.సదుంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

తనకల్లు: రాష్ట్రంలో సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని టీ.సదుం, ఎర్రగుండోళ్లపల్లి, ఎర్రచెరువుపల్లి గ్రామాలలో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో ప్రతి గడపకూ వెళ్లి వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. లబ్ధిదారులు ప్రభుత్వం నుంచి ఎంత మేరకు లబ్ధి పొందారో తెలుపుతూ అందుకు సంబంధించిన బుక్‌లెట్‌లను అందజేశారు. ఏవైనా పరిష్కారానికి నోచుకోని సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. టీ. సదుం, ఎర్రచెరువుపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను వేయించాలని గ్రామస్తులు కోరారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఎక్కడెక్కడ అవసరమో గుర్తించి, అందుకు తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. వీధులకు తగినన్ని విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇళ్ల స్థలాలు ఉన్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లను మంజూరు చేయాలని పేర్కొన్నారు. అర్హులందరికీ ప్రభుత్వం నుంచి ఇళ్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా విన్నవించుకునే కొత్త కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. జగనన్న ప్రభుత్వంలో పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రజలకు నేరుగా పారదర్శకంగా పథకాలు అందిస్తున్నట్లు తెలియజేశారు. ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పూల నరసింహులు, మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ హిమధర్‌రెడ్డి, ఆసుపత్రా అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్‌దేశాయ్, నాయకులు శ్రీనివాసుల నాయుడు, చిన్నపరెడ్డి, ఆనందరెడ్డి, రెడ్డిపీరా, బాబాఫక్రుద్దీన్, గౌస్‌పీర్, నజీర్,, రమణారెడ్డి, నాగభూషణరెడ్డి, దుశ్శాని నీలకంఠారెడ్డి, చిదానందరెడ్డి, రామమోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, నరసింహులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ముదిగుబ్బ: ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో అలసత్వం తగదని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హితవు పలికారు. బుధవారం మండలంలోని మల్లేపల్లి, తప్పెటవారిపల్లి, కొండగట్టుపల్లి, సానేవారిపల్లి, మలకవేమల, రామస్వామి తండా, ఒడ్డుకిందతండా, పొడరాళ్లపల్లి, మంగళమడక సచివాలయాలను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది, ప్రజలతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలను అందించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. సీఎం ఆశయాలను నెరవేర్చే దిశగా ప్రతి ఉద్యోగి బాధ్యతగా పని చేయాలన్నారు. ప్రజల నుంచి సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించారు. అక్కడే వున్న అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజలతో మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సరిగా పని చేయకపోతే తనకు ఫిర్యాదు చేయాలంటూ ఫోన్ నంబర్ ఇచ్చారు. మల్లేపల్లి సచివాలయంలో పని చేసే వెల్ఫేర్ అసిస్టెంట్ అమరనాథ్‌పై గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. లో ఓల్టేజీ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్లు తదితర సమస్యలను పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను త్వరగతిన పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అదే విధంగా కొండగట్టుపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగేంద్ర, ఎంపీడీఓ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి, సర్పంచులు పాపయ్య, వెంకటరమణ, నాగభూషణ, చంద్రాయుడు, మినీబాయి, ఎంపీటీసీలు మస్తాన్‌రెడ్డి, మంజునాథ్, నాయకులు మాధవరెడ్డి, పాల్యం క్రిష్టయ్య, పెరుగు మధు, కిరణ్‌మోహన్ రెడ్డి, బయపరెడ్డి, మునిస్వామి నాయక్, కోటేశ్వర్‌రెడ్డి, శ్రీనాథ్, భాస్కర్‌రెడ్డి, వెంకటరమణ, రంజిత్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ రాము

ఎన్‌పీకుంట: అధికారులు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ ఈటె రాము అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేయబోతున్న అసైన్డ్‌మెంట్ కమిటీలో అధిక శాతం అర్హులైన వారికి కాకుండా అనర్హులకు చోటు కల్పిస్తున్నారని, పలు సచివాలయాల పరిధిలో పని చేస్తున్న సర్వేయర్ల తీరు సరిగా లేదని పి కొత్తపల్లి, పెడబల్లి, పడమరనడింపల్లి, వంకమద్ది, ధనియానిచెరువు, ఎదురుదోన సర్పంచులు, ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) చెప్పిన విధంగా సర్వేయర్లు నడుచుకుంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. కదిరి–రాయచోటి ప్రధాన రహదారి పనులు జరుగుతున్నప్పటికీ అక్కడక్కడ గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్‌లు, ఏఎల్‌మ్‌లు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని, అటువంటి వారికి జీతాలు నిలుపుదల చేయాలని పలువురు ఎంపీటీసీలు ఫిర్యాదు చేశారు. ఉపాధి హామీ పథకం కింద పొలాల వద్దకు మట్టి రోడ్లను ఏర్పాటు చేయించాలని బలిజపల్లి సర్పంచ్ శీలం వెంకటరామిరెడ్డి కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆదినారాయణ, తహసీల్దార్ రవినాయక్, ఈఓఆర్డీ మనోహర్, వైస్ ఎంపీపీలు కేశవరెడ్డి, సంపూర్ణ, ఎంపీటీసీలు లక్ష్మీదేవి, సరస్వతి, క్రిష్ణమ్మ, తిమ్మారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు సుబహాన్, సర్పంచులు అంజినమ్మ, రాధ, కె.దిల్షాద్, భారతమ్మ, నాగమునీశ్వర నాయుడు, విష్ణుమూర్తి, వెంకటేశు పాల్గొన్నారు.

వక్ఫ్ భూములను కాపాడాలి



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జియావుద్దీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కేఎస్ బాహుద్దీన్

కదిరి అర్బన్: పట్టణంలో ఈద్గా, ఖబరస్థాన్ చెందిన భూములను వక్ఫ్‌బోర్డ్ పరిధిలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మైనార్టీ వ్యవహారాలు) డా.జియావుద్దీన్, కార్యదర్శి ఇంతియాజ్, వక్ఫ్‌బోర్డ్ ప్రత్యేక అధికారి షిరిన్ బేగంను వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేఎస్ బాహుద్దీన్ వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు సమర్పించారు. బుధవారం ఆయన బుధవారం విజయవాడలో వారిని మర్యాదపూర్వకంగా కలసి సమస్యలు విన్నవించారు. ఈద్గా ఖబరస్థాన్‌లో భూమిలో వచ్చే ఆదాయాన్ని కొందు దోచుకుంటున్నారని తెలిపారు. కుటాగుళ్ల రైల్వే గేట్ వద్ద నిర్మించ తలపెట్టిన ఫ్లైఓవర్‌లో 500 సంవత్సరాల చరిత్రగల సర్వే నెంబర్ 407, 408, 400ఏ, ఈద్గా, ఖబరస్థాన్, జహీరుద్దీన్ బాబాషా దర్గాలను కాపాడాలని పేర్కొన్నారు. వక్ఫ్ భూములు కాపాడాలని చూస్తున్న కుటాగుళ్ల దర్గా పీఠాధిపతి సయ్యద్ ఉబేదుల్లా హుస్సేనికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోకూడదని అందులో విన్నవించారు.

సంక్షిప్త సమాచారం

15న ఓబుళేశ్వర స్వామి భూముల వేలం

తలుపుల: హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఈనెల 15వ తేదీన గంజివారిపల్లి గ్రామంలోని మండల పరిషత్ హైస్కూల్‌లో ఓబుళేశ్వర స్వామి భూములను కౌలుకు ఇచ్చేందుకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ రామాంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల రైతులు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

బాలుడిపై కుక్కల దాడి

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని నిజాంవలీ కాలనీకి చెందిన మహమ్మద్ హుస్సేన్ కుమారుడు ఇర్ఫాన్ బుధవారం ఆడుకుంటుగా వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో ఇమ్రాన్ శరీరం అంత రక్తగాయాలయ్యాయి. వెంటనే కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. గతంలో కుడా సైదాపురం, వలీంసాబ్ రోడ్డు, ఇక్బాల్ రోడ్డులో వీధి కుక్కల దాడిలో 20 మంది చిన్నారులు గాయపడ్డారు. అయితే మున్సిపల్ అధికారులు పట్టించుకుని దాఖలాలు లేవు. పలుమార్లు అధికారులకు చెప్పిన పట్టించుకోలేదని కాలనీ వాసులు తెలిపారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి వీధి కుక్కలను దూరంగా తరలించాలన్నారు.

వ్యక్తికి గాయాలు

కొత్తచెరువు: మండల పరిధిలోని మైలసముద్రం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. బుక్కపట్నం మండలం చంద్రాయుని పల్లి గ్రామానికి చెందిన రాజు పని నిమిత్తం మైలసముద్రం నుంచి అనంతపురానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. గ్రామ సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా వచ్చిన ఓ కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. సమీపంలో ఉన్న రైతులు గమనించి వెంటనే సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. గాయపడిన రాజును చికిత్స కోసం అనంతపురం తరలించినట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు. విచారణ చేపట్టామన్నారు.

12 నుంచి గంగాభవాని తిరునాల

గాండ్లపెంట: ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు గంగా భవాని తిరునాల నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. 12వ తేదీ గంగాభవాని మాత కలశ పూజ, అభిషేకం, రాత్రికి కత్తివారిపల్లి భజన బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం. 13న మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారి పంచలోహ విగ్రహం ఊరేగింపు, రాత్రి 9 గంటలకు పాటల కచేరి, 14వ తేదీ తెల్లవారుజామున 2 గంటలకు జ్యోతులు, బోనాల ఊరేగింపు, సాయంత్రం 4 గంటలకు ఉట్ల తిరునాల జరుగుతుందని పేర్కొన్నారు.

విరాళం అందజేత

గాండ్లపెంట: గంగా భవానీ తిరునాలకు ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి పంపించిన రూ.30 వేల విరాళాన్ని పార్టీ కన్వీనర్ పోరెడ్డి చంద్రఖరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జక్కల లక్ష్మీనరసింహ గౌడ్, ఇక్బాల్, గంగయ్య యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు ఆనంద్, మారుతి, ఆనందరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

అక్రమంగా గుడిసెల ఏర్పాటు

ఓడీ చెరువు: మండలంలో కదిరి–హిందూపురం ప్రధాన రహదారి పక్కన ఇనగలూరు రెవెన్యూ పాలెం సర్వే నంబర్ 983–2లోని ప్రభుత్వ వాగు భూమిలో కొంతమంది అక్రమంగా గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. తహసీల్దార్ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినా భేఖాతర్ చేశారు. రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడంతోనే రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురి అవుతోంది. చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.